
ప్రజా విశ్వంభర V3 NEWS




# ఈ నెల 23న భోపాల్‌లో 'పెద్ది' రీసౌండ్ ఖాయం!

**రామ్ చరణ్ 'పెద్ది' సినిమా ప్రమోషన్లు ప్రారంభం**

**మే 23న భోపాల్‌లో స్పెషల్ సాంగ్ ఈవెంట్**

**ఈ కార్యక్రమంలో ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్**

**జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. సినిమా ప్రమోషన్లకు ఒక గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్‌తో కిక్ ఇచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ మేరకు మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో జరగనున్న ఈ ఈవెంట్‌లో భాగంగా సినిమాలోని ఒక ప్రత్యేక గీతాన్ని పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. ఆయన ఈ వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నట్లు మేకర్స్ తెలిపారు. దీంతో ఈ ఈవెంట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్‌తో పాటు జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. భోపాల్ ఈవెంట్‌తో సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు.కాగా, మే 18న పెద్ది ట్రైలర్ రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ముంబైలో పెద్ది ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించనున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్స్ అధికారికంగా ప్రారంభం కానున్నాయి.




# 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో ఊర్వశి రౌతేలా

**భారీ సిల్వర్ గౌనులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నటి పక్షి ఆకారంలో ఉన్న తల ఆభరణం ప్రధాన హైలైట్**

తనదైన మాక్సిమలిస్ట్ స్టైల్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించిన ఊర్వశి వియత్నాం లేబుల్ రూపొందించిన కస్టమ్ గౌనులో మెరుపులు ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 79వ ఎడిషన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరాలో మే 12 నుంచి 23 వరకు జరిగే ఈ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రముఖులు హాజరయ్యారు. అలియా భట్, డెమీ మూర్ వంటి తారలు ప్రారంభోత్సవంలో తమ స్టైల్‌తో ఆకట్టుకోగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనదైన ప్రత్యేకమైన డ్రెస్సింగ్ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై ప్రధాన ఆకర్షణగా నిలిచారు.ప్రారంభోత్సవం కోసం ఊర్వశి వియత్నాంకు చెందిన ఫ్యాషన్ లేబుల్ 'జోలీపోలీ' డిజైన్ చేసిన కస్టమ్ కౌచర్ గౌనును ఎంచుకున్నారు. లావెండర్ రంగు బేస్‌పై భారీ సిల్వర్ అలంకరణతో ఉన్న ఈ గౌను చూడగానే కట్టిపడేసింది. క్రిస్టల్స్, సీక్విన్స్, పూసలు, రాళ్ల వర్క్‌తో గౌను మొత్తం కేన్స్ లైట్ల వెలుగులో తళతళా మెరిసింది. మత్స్యకన్య ఆకారాన్ని పోలి ఉన్న ఈ గౌను ఆమె అందాన్ని రెట్టింపు చేసింది.

ఈ డ్రెస్ ప్రత్యేకతల్లో కార్సెట్ తరహాలో ఉన్న బాడీస్ ఒకటి. గౌనుపై శిల్పం చెక్కినట్టుగా వెండి ఎంబ్రాయిడరీతో సున్నితమైన డిజైన్లు ఉన్నాయి. స్వీట్‌హార్ట్ నెక్లైన్‌తో పాటు భుజాల వద్ద ఉన్న అలంకరణలు డ్రెస్‌కు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టాయి. పొడవైన కేప్ స్లీవ్స్, వాటికి వేలాడుతున్న క్రిస్టల్ టాసెల్స్... వెండి రెక్కలు తొడుక్కున్నట్టుగా ఆకర్షించాయి.



# కేన్స్‌లో అలియా కామెంట్స్.. నెట్టింట విమర్శలు


బాలీవుడ్ అగ్ర కథానాయిక అలియా భట్ ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతోన్న 79వ కేన్స్ ఫెస్టివల్‌లో సందడి చేస్తున్నారు. ఈ వేదికగా భారతీయ చిత్ర పరిశ్రమలో పురుషాధిక్యత గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాశంగా మారాయి. భారతీయ బాక్సాఫీస్ వద్ద కేవలం పురుష ఆడియన్స్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని సినిమాలు తీయడాన్ని ప్రశ్నించారు."ప్రపంచవ్యాప్తంగా 'బార్బీ' లాంటి మహిళా ప్రధాన చిత్రాలు భారీ విజయాన్ని సాధిస్తున్నాయి. కానీ, భారత్‌లో మాత్రం ఎప్పుడూ హీరో ప్రాధాన్యం కలిగిన చిత్రాలే ఎక్కువగా తీస్తున్నారు. 75 శాతం సినిమాలు మాస్ ఆడియన్స్‌ను దృష్టిలోపెట్టుకుని రూపొందిస్తున్నారు. మరి మహిళా ప్రేక్షకుల సంగతేంటి? వారికి కావాల్సిన సినిమాలు ఎవరు తీస్తారు?. నేను హీరో ప్రధానంగా సాగే యాక్షన్ సినిమాలు తీయొద్దని చెప్పడం లేదు.. కానీ సినిమాలు ఒక వర్గం కోసం మాత్రమే కాదని.. అందరి కోసం రూపొందించాల్సిన అవసరం ఉందని చెబుతున్నా. సినిమాల్లో ప్రధాన పాత్రలో ఎవరు నటిస్తున్నారనేది ప్రేక్షకులు చూడరు. వాళ్లు కథను మాత్రమే చూస్తారు" అని అలియా స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్ అవుతుండగా.. నెటిజన్‌లు అలియాను విమర్శిస్తున్నారు. గతంలో తన భర్త నటించిన 'యానిమల్' హింసాత్మకంగా ఉందని కామెంట్స్ వచ్చినప్పుడు అలియా ఆ చిత్రాన్ని సమర్థించడాన్ని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కేన్స్‌లో ఇలా మాట్లాడటం ఎందుకంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు 'ధురంధర్' చిత్రంపై ఆమె ఇప్పటికీ మౌనం వహించడాన్ని కూడా తప్పు పడుతున్నారు.



# విజయ్‌ను కేవలం నటుడిగా చూడకూడదు: కమల్‌హాసన్

చిత్ర పరిశ్రమకు చెందిన విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి కావడం ఓ నటుడిగా గర్వంగా ఉందన్నారు కమల్ హాసన్ . అయితే ఇప్పుడు విజయ్‌ను కేవలం యాక్టర్‌గా చూడవద్దన్నారు. ఆయనకు వేరే పెద్ద బాధ్యతలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో.. ప్రార్థనా మందిరాలు, పాఠశాలలు, కళాశాలల సమీపంలో నడుస్తున్న 717 మద్యం దుకాణాలను మూసివేయాలన్న నిర్ణయం ప్రశంసనీయం అని అన్నారు. విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కమల్‌హాసన్ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే. మద్యం దుకాణాలను తొలగించాలన్న విజయ్ నిర్ణయంపైనా ఆయన తక్షణమే స్పందించారు. ఈ చర్యను నిరంతరాయంగా కొనసాగించాలన్నారు.

# పంజాబ్ కింగ్స్‌పై రూమర్లు.. ప్రీతి జింటా వార్నింగ్



ఈ ఐపీఎల్ సీజన్‌లో తొలుత అదిరే ఆటతో వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్.. సెకండాఫ్‌లో చతికిలపడింది. నాలుగో ఓటమితో ప్లేఆఫ్ ఆశలను సంక్లిష్టం చేసుకుంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పంజాబ్ జట్టుపై నెట్టింట విమర్శలు వ్యక్తమవు తున్నాయి. జట్టు ఆటగాళ్లలో క్రమశిక్షణ, సమన్వయం లోపించాయని, దీనివల్లే వరుస ఓటములు చవిచూడాల్సి వస్తోందని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వార్తలపై పంజాబ్ కింగ్స్ సహ యజమాని ప్రీతి జింటా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి అసత్య ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు."విమర్శలు, అసత్య ప్రచారం మధ్య చాలా తేడా ఉంటుంది. గేమ్ గురించి ఆరోగ్యకరమైన చర్చను మేం స్వాగతిస్తాం. కానీ, ఉద్దేశపూర్వకంగా అసత్య కథనాలను వ్యాప్తి చేస్తూ.. మా ఆటగాళ్లు, జట్టు పరువుకు భంగం కలిగిస్తే మాత్రం సహించేది లేదు. నిరాధార సమాచారం విషయంలో మీడియా అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నా" అని ప్రీతి జింటా తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. చౌకబారు ఆదరణ కోసం అసత్య కథనాలను సృష్టించడం ఆటలో భాగం కాదు. పాపులారిటీ కోసం తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ముందు వాస్తవాలను నిర్ధరించుకోవాలని కోరుతున్నాం" అని ఫ్రాంఛైజీ రాసుకొచ్చింది.ఇటీవల పంజాబ్ ఆటగాడు చాహల్ విమానంలో ఈ-సిగరెట్ పీల్చినట్లుగా ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దిల్లీతో జరిగిన మ్యాచ్‌లో చాహల్‌కు బౌలింగ్ ఇవ్వకపోవడంతో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై విమర్శలు వ్యక్తమయ్యాయి. జట్టు ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఫిట్‌నెస్ కోల్పోవడమూ చర్చకు దారితీసింది.

# సన్‌రైజర్స్ కంగారొద్దు.. అక్కడ ఏ జట్టుకూ సేఫ్ కాదు: కైఫ్

**విశ్వంభర, స్పోర్ట్స్:** ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. తాజాగా సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన గుజరాత్ అనూహ్యంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఆ జట్టు వరుసగా ఐదు మ్యాచుల్లో గెలవడం గమనార్హం. ఇక ఆర్సీబీ, సన్‌రైజర్స్, హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ తర్వాత స్థానాల్లో నిలిచాయి. సీఎస్‌కే, రాజస్థాన్ కూడా తమ అవకాశాలు కోసం పోటీ పడుతున్నాయి. టాప్-4లో నిలవాలనుకొనే జట్లను మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ హెచ్చరించాడు. అలాగే తొలిసారి అహ్మదాబాద్‌లో ఆడి ఘోర ఓటమిని చవిచూసిన సన్‌రైజర్స్ ఎలాంటి కంగారు పడక్కర్లేదని వ్యాఖ్యానించాడు. "సీఎస్‌కేతో చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ తలపడనుంది. సొంత మైదానం కావడంతో చెన్నై సూపర్ కింగ్స్‌కు అడ్వాంటేజ్ ఉంటుంది. తప్పకుండా ఎస్ఆర్‌హెచ్‌కు కఠిన సవాల్ ఎదురవుతుంది. అయితే, పరిస్థితులను త్వరగా అలవర్చుకుని ఆడితే పెద్ద కష్టమేం కాదు. గుజరాత్‌తో మ్యాచ్‌లో అదే పొరపాటును సన్‌రైజర్స్ చేసింది. తప్పకుండా దీనిపై వారి డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చించుకోవాలి. అలాగని ఈ ఓటమితో కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇక చివరి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్‌తో హైదరాబాద్‌లో తలపడనుంది. ఈ రెండు మ్యాచులు సన్‌రైజర్స్‌కు అత్యంత క్లిష్టమైనవే. అయితే, టాప్-4 కోసం పోటీపడుతున్న జట్లేవీ సురక్షితంగా ఉన్నాయని అనుకోవద్దు" అని కైఫ్ వెల్లడించాడు.



**ట్రాఫిక్‌లో 100కి.మీ వేగంతో వెళ్లినట్లు: అశ్విన్**

అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై గుజరాత్ టైటాన్స్ భారీ విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్య ఛేదనలో 86 రన్స్‌కే కుప్పకూలింది. ఈ క్రమంలో అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "హైవేపైనా.. ట్రాఫిక్‌లోనూ ఒకే స్పీడ్‌తో వెళ్లగలమా? కానీ, అభిషేక్ శర్మ ఆ తప్పే చేశాడు. హైవేలపైనా 100 కి.మీ కంటే ఎక్కువ స్పీడ్‌తో వెళ్లే అవకాశం ఉంటుంది. కానీ, ట్రాఫిక్‌లోనూ వెళ్తే ఎవరో ఒకరు గాయపడతారు. క్రికెట్ కూడా అంతే. పరిస్థితికి తగ్గట్టుగా స్పందించాలి. అభిషేక్ ఔటైన బంతికి సింగిల్ తీసి.. నాన్‌స్ట్రైకింగ్‌కు వెళ్లుంటే బాగుండేది. మంచి భాగస్వామ్యాన్ని నిర్మిస్తే సన్‌రైజర్స్ విజయం సాధించే అవకాశాలు ఎక్కువ. విరాట్, రోహిత్ శర్మ ఎందుకు లెజెండ్స్ అయ్యారో కుర్రాళ్లు తెలుసుకోవాలి. వారు పరిస్థితులను అర్థం చేసుకుని ఆడతారు. ఏ రోడ్డుపైన అయినా ఒకే వేగంతో వెళ్లు. సన్‌రైజర్స్‌లో టాప్ -3 బ్యాటర్లలో ఒక్కరు కూడా బాధ్యత తీసుకోలేదు" అని అశ్విన్ విశ్లేషించాడు.

# ద్రవిడ్‌కూ ఓ టీ20 ఫ్రాంఛైజీ

**ఢిల్లీ:** బ్యాటర్, కెప్టెన్, వికెట్‌కీపర్, కోచ్, మెంటార్.. ఇలా తన కెరీర్‌లో భిన్నమైన పాత్రలు పోషించిన భారత దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ ఇప్పుడు ఓ కొత్త అడుగు వేశాడు. ఓ ఫ్రాంఛైజీకి యజమాని అయ్యాడు. ఐరోపా టీ20 లీగ్‌లో డబ్లిన్ గార్డియన్స్ జట్టును తాజాగా ద్రవిడ్ కొన్నాడు. ఈ ఏడాది ఆగస్టులో ఆరు ఫ్రాంఛైజీలు తలపడే ఐరోపా లీగ్ ఆరంభం కానుంది. ఐరోపాలో ఐసీసీ ఆమోదం పొందిన తొలి బహుళ దేశాల క్రికెట్ టోర్నీ ఇదే. ఐర్లాండ్, స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ సంఘాలు ఈ లీగ్‌లో భాగమయ్యాయి. "ఐరోపాలో దిగువ స్థాయి నుంచి క్రికెట్లో ప్రతిభావంతులను వెలికి తీయడానికి ఈ లీగ్ ఉపయోగ పడుతుంది. ఇక్కడ ఆట ఎదుగుదలకు ఇదెంతో సహకరిస్తుంది. నన్ను ఆకట్టుకున్న అంశం అదే. అందుకే డబ్లిన్ గార్డియన్స్ జట్టును కొని ఈ లీగ్‌లో భాగమయ్యా. స్టార్ ప్లేయర్లతో స్థానిక కుర్రాళ్లు కలిసి ఆడబోతుండడంతో ఈ లీగ్ ఆసక్తికరంగా సాగబోతోంది" అని ద్రవిడ్ చెప్పాడు. మరోవైపు బ్యాటర్లకు పెద్దపీట వేస్తున్న టీ20ల్లో రాణించాలంటే బౌలర్లు తమ ఆటను మరింత మెరుగుపరుచుకోవాలని ద్రవిడ్ అన్నాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com